మధ్యాహ్న భోజన పథకాన్ని అకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీఓ

విశాలాంధ్ర - టెక్కలి : మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంపీడీవో సిహెచ్ లక్ష్మీబాయి ఉపాధ్యా యులకు తెలిపారు. మండల పరిధిలో మేఘవరం ఎంపీపీ స్కూల్ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం తయారీ, రుచి నాణ్యతను పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనం పెడుతున్నారో లేదోనని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. భోజనం సక్రమంగా పెట్టకపోతే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం స్టాక్ రిజిస్టర్ ను, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వంట సహాయకులు ఉన్నారు.

హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లా ఉన్న హెూటళ్లు, లాడ్జీలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం హెూటళ్లు, లాడ్జీల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ "ఈ వినూత్న వ్యవస్థ హెూటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లలో పరిశుభ్రతను నిర్ధారిం చడం ద్వారా పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తుందని, గ్రీన్ లీఫ్ రేటింగ్ ద్వారా కలెక్టర్ బఫర్ గిల్ కెర్ వారికి గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వబడుతుందని ప్రకటించారు. "లిగ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ వివిధ విభాగాలలో అమలు చేయబడుతుందని పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక రంగంలో సురక్షితమైన పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించడానికి ఈ రేటింగ్ వ్యవస్థ ప్రవేశపెట్టబడిందని ఆయన పేర్కొన్నారు." రేటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయబడుతుందని, కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య మిషన్, జడ్పీ సీఈవో, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సభ్యులతో కూడిన కమిటీ ఉంటుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవ హరిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో హెూటళ్లు, లాడ్జీలను తనిఖీ చేయడానికి ఒక ఉప కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఉన్న హెూటళ్లు, లాడ్జీల జాబితా గ్రామ పంచాయతీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచబడుతుందన్నారు. జిల్లా స్థాయి శిక్షణను క్రమానుగతంగా నిర్వహిస్తామన్నారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించడంలో సహకరించాలని కలెక్టర్ జిల్లాలోని అన్ని హెూటళ్లు, లాడ్జీల యాజమాన్యాలకు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య మిషన్ ఎస్ఈ ఎహసాన్ భాషా, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్, హెూటల్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ మెట్ట నాగరాజు, హెూటల్ అసోసి యేషన్ జిల్లా సెక్రటరీ సతీష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కమిటీల ఏర్పాటు

- జిల్లా కన్వీనర్ గా బుడుమూరు సూర్యారావు
- శ్రీకాకుళం డివిజన్ కు డాక్టర్ జామి భీమశంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కోసం జిల్లా, డివిజన్ కన్వీనర్లను ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మంగళవారం ఉదయం ప్రకటించారు. జిల్లా కన్వీనర్ గా విద్యావేత్త బుడుమూరు సూర్యారావును నియమించారు. ఆయన ప్రస్తుతం బూర్జ మండల ఉపాధ్యక్షునిగా ఉన్నారు. గ్రంథాలయ వ్యవస్థ పట్ల అభిమానం ఉన్నవారినే ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వారి రాజకీయ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని శివప్రసాద్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రెవిన్యూ డివిజన్ కన్వీనర్ గా విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్ ను, టెక్కలి డివిజన్ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టు బెండి నర్సింగరావును, పలాస డివిజన్ కన్వీనర్ గా విద్యావేత్త చాపర వేణుగోపాల్ ను నియమించారు. జిల్లా కమిటీలు డివిజన్ కన్వీనర్లు కూడా సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కే శ్రీనివాస్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, న్యాయవాది బొడ్డేపల్లి మోహన్ రావు, విశ్రాంత లైబ్రేరియన్, జర్నలిస్ట్ దూరి గోపాలరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విద్యావేత్త శాసనపురి మధుబాబు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎంవి మల్లేశ్వరరావులను సభ్యులుగా ఎంపిక చేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని, విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను మరింత పరిపుష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నమని శివప్రసాద్ అన్నారు. గ్రంథాలయ సెస్ ద్వారా లభిస్తున్న కోట్లాది రూపాయలను, ఇతర కార్యక్రమాలకు మళ్లించకుండా, గ్రంథాలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నదే ఈ ఉద్యమ ధ్యేయమని చెప్పారు. గ్రంథాలయ పాఠకుల్లో, విద్యావంతుల్లో చైతన్యం తీసుకో రావడం ద్వారా, ప్రజా ప్రతినిధులకు ప్రశాంతమైన వాతావరణంలో వినతి పత్రాలు ఇవ్వడం ద్వారా, వివిధ స్థాయిల సదస్సుల ద్వారా ప్రభుత్వం గ్రంథాలయాల కోసం శ్రద్ధ తీసుకునే విధంగా ఉద్యమం కొనసాగుతుందని శివప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ లో విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ ఉద్యమంలో కవులు, రచయితలు, వివిధ రంగాల మేధావులు, పుస్తక ప్రచురణ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా, డివిజన్ కమిటీలు మంచి దృక్పథంతో పనిచేయగలవన్నా ఆశాభావాన్ని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, కథా నిలయం ప్రతినిధి దాసరి రామచంద్రరావు, శ్రీకాకుళం సాహితీ ప్రతినిధులు, కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసు బాబు తదితరులు వ్యక్తం చేస్తూ, ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

వైసీపీ వారు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- గత ఐదేళ్లు సహజ వనరులను దోచేశారు
- వైసీపీ వ్యాఖ్యలను తిప్పి కొట్టిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభి వృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని గత పాలనలో వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే సమంజసంగా ఉంటుం దని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నీటి సంఘా ల ప్రాజెక్టు డైరెక్టర్ సనపల డిల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడు తూ రాష్ట్రంలో ఇసుక దోపిడీకి గురైందని వైసీపీ నాయకులు చింతాడ రవికుమార్ ఆరోపించా రని ఆయన దందాకు అడ్డు తగిలారని కూటమి ప్రభు త్వ నేతలపై విమర్శలు చేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు టన్ను ఇసుక ను పది రూపాయలకు విక్రయించాలని ఒక గుత్తే దారు 104 రూపాయలకు టెండర్లు దక్కించుకొని కావలసిన వారికి అందిస్తున్నారని గత ప్రభుత్వం లో టన్ను ఇసుక 500 కు అమ్ముకోలేదని విమ ర్శించారు. గతంలో లారీ ఇసుక విశాఖపట్నం చేరేసరికి 50,000 అయ్యేదని ప్రస్తుత కూటమి ప్రభు త్వంలో 15 నుంచి 18 వేల రూపాయలకే చేరు తోందని గుర్తు చేశారు. గత పాల కులు చేసిన విధ్వంసాన్ని తెలుసుకొని విమర్శలు చేయాలని హితవుపలికారు. గత పాలనలో సహజ వనరు లను దోచుకున్నారని విమర్శించారు. వైసీపీలో జరిగిన అక్రమాలను ఎత్తిచూపుతో వారి మాటల ను తిప్పికొట్టారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికు మార్ ఆ ధ్వర్యంలో అభివృద్ధి పదాన ఆముదాలవలస పరు గులు పెట్టిస్తున్నారని ఇది చూసి ఓర్వ లేక వైసీపీ నా యకులు విమర్శలు చేయటం తగు నా అని అన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం 32 వేల కోట్ల రూపా యలతో థర్మల్ పవర్ ప్లా నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తుంటే కాలు ష్యం వెదజల్లుతోందని వైసిపి వారు విషం కక్కు తున్నారని తెలిపారు. పవర్ ప్లాంట్ వలన వచ్చే కాలుష్యానికి కాలుష్య రహిత ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని ఇ మాత్రం చిన్న లాజిక్ ను మరచి విమర్శలు చేయడం తగదన్నారు. యువత పోరు పేరున ఏ ప్రయోజనాలసించి నిరసనలు చేస్తు న్నారు ప్రజలకు తెలియజేయాలన్నారు. గతంలో 4,500 కోట్ల రూపాయలు ఫీజు బకాయిలు ఉన్నా యని, వాటిని కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న విష యాన్ని గుర్తు చేశారు. మీరు చేసే అక్రమ దందాలను కాదన్నారని ప్రజా ప్రభుత్వం పై విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు. వైసిపి వారివి అర్థ రహిత విమర్శలని తిప్పి కొట్టారు. వారు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తు న్నారని తప్పనిసరిగా బుద్ధి చెబుతారని తెలి పారు. ఇప్పటికే ప్రతిపక్షం కూడా లేకుండా చేసి నప్పటికీ వారిలో ఏమాత్రం మార్పు రాలేదని తెలి పారు. తమ్మినేని అప్పలనాయుడు, బొడ్డేపల్లి విజయ్ కుమార్, కిల్లి సిద్ధార్థ, కె లోకేష్ తదిత రులు కార్య క్రమంలో ఉన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మహాత్మా గాంధీ పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి అన్నారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే పదవ తరగతి మొదటి మెట్టని, విద్యార్థులు దీనినే అధిరోహిస్తే అనుకున్న లక్ష్యాలకు చేరుకుంటారని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, స్కూలు చైర్మన్‌తో పాటు శ్రీరామ సేవా సంఘం అధ్యక్షులు ఎం.వర ప్రసాద్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, ఎం.ఇ.వో., విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీ విజేతలకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంత బొమ్మాళిలో వేంచేసి ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి 25 వ వార్షికోత్సవ సందర్భంగా, మంగళవారం సంత బొమ్మాళి ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 29 మంది విద్యార్థులు పాల్గొనగా, వర్షిని, నిహారిక, చిన్నారావులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. ఈ విద్యా ర్థులకు సంతబొమ్మాళి గ్రామ పెద్దలు కూచెట్టి కృష్ణారావు, వప్పు రాజు, కూచెట్టి భాను ప్రకాష్, అట్టాడ సాయికుమార్తో పాటు పలువురు గ్రామ పెద్దలు బహుమతులు అందజేసారు.

డీఎస్పీ ను కలిసిన ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ సభ్యులు

విశాలాంధ్ర - టెక్కలి : డివిజనల్ సూపర్డియంట్ ఆఫ్ పోలీస్ డిఎస్ఆర్ వివిఎన్ మూర్తిని మంగళవారం ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింగరావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి మెమొంటోను అందజేశారు. ఇటీవల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా డీఎస్పీ మూర్తి నీ ఆహ్వానించడం జరిగింది. అయితే ఆ కార్యక్రమానికి ఆయన పనులు ఒత్తిడి వలన హాజరు కాలేకపోయారు. అందుకు మంగళవారం ప్రెస్ క్లబ్ సభ్యులు కలిసి ఆయనకు మెమొంటోను అందజేసి, దృశ్యాలువాతో సత్కరించి, ఏపీయూడబ్ల్యూజే డైరీ ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నర్సింగరావు డీఎస్పీ తో మాట్లాడుతూ మీడియా ప్రతినిధుల పై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలి" అని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, గ్రామ సచివాలయం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు వంటి అంశాలపై చర్చించారు. "పల్లె పండుగ పనులను త్వరగా పూర్తి చేయాలి. ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలి. గృహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలి. కాలువలు, చెత్త కుప్పల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచాలి. కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. చెత్త నుంచి సంపద షెడ్ల నిర్మాణం పూర్తి చేయని 200 పంచాయతీలు వివరణ ఇవ్వాలి" అని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. "రెవెన్యూ సదస్సులు, రీసర్వే-ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇంటి నుండి పని, పి4 సర్వే, ఎంఎస్ఎమ్ఈ సర్వే తదితర అంశాలపై ఆయా అధికారులు సమగ్ర వివరాలు అందించాలి" అని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షకు ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డిపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, ఐసిడిఎస్ పీడి బి.శాంతి శ్రీ, డ్వామా పీడీ సుధాకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

రైతులు తమ పొలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి త్రినాధస్వామి

విశాలాంధ్ర - నరసన్నపేట : జిల్లాలోని రైతాంగం తమ పొలాలను పి.ఎం కిసాన్ పథకం క్రింద సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి, త్రినాధస్వామి అన్నారు. మంగళ వారం ఆయన మండలంలోని సత్యవరం, తామరాపల్లి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. ఈ సంధర్భంగా కార్యక్రమానికి హాజరైన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ పథకంలో భాగంగా రైతులు తమ పొలాలను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూనిక్ కార్డులను మంజూరు చేస్తుందని తెలిపారు. దీని వలన రైతులు ఆ కార్డు ఉపయోగించుకుంటే సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయనికి యంత్ర పనిముట్లు అందచేస్తారన్నారు. అలాగే రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నామని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరక్టర్, కె.రవీంద్ర భారతి, మండల వ్యవసాయాధికారిణి, కె.సునీత, సత్యవరం, తామరాపల్లి రైతు సేవా కేంద్రాల వ్యవసాయాధికారులు, విజయకృష్ణ, శిరీష, రైతులు, భైరి తవిటయ్య, గెంబలి ప్రభాకరరావు, కోల రాము, చింతు సూర్యనారాయణ, ఇప్పిలి నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి యువత పోరుకు.. రండి.. కదలిరండి

విశాలాంధ్ర - హిరమండలం : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్ లో యువత పోరు అనే కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంపీటీసీలు సర్పంచులు తేదీ 12.3.2024 బుధవారం ఉదయం జిల్లా కేంద్రంశ్రీకాకుళం లో పాల్గొవాలని, పాతపట్నం మాజీ శాసనసభ్యులు శాంతి ఆదేశాల మేరకు, యువత పోరు పోస్టర్ను హిర మండలలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారంవిడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైయస్సార్సీపి ప్రధాన కార్యదర్శి ఏవి సురేష్, మండల వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి చిన్నారావు, ఎంపీటీసీ సభ్యులు దేవర గంగాధర్, వైయస్సార్సీపి నియోజకవర్గ కార్మిక విభాగ అధ్యక్షుడు చెక్క బాలకృష్ణ, మాజీ దేవాదాయ చైర్మన్, వాకర్ రాజారావు, వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు కేలం నరసింహమూర్తి, వైఎస్ఆర్సిపి యువ నాయకుడు పతివాడ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'యువత పోరు' : జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సురేష్

విశాలాంధ్ర - హిరమండలం : నేడే అనగా 12వ తేది బుధవారం ఉదయం 9:00 గంటలకు యువత పోరు కార్యక్రమం పార్టీ ఆవిర్భావ వేడుకలు శ్రీకాకుళం జిల్లా పార్టీ ఆఫీసు దగ్గర జరుగనున్నాయని జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి అంద వరం వెంకట్ సురేష్ మంగళవారం ఓ ప్రకటన లో వెల్లడించారు.. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద "యువత పోరు" అనే నినాదంతో విద్యార్థులు, నిరుద్యోగులు మరియు యువత ఎదుర్కొంటున్న, సమస్యలపై సంఘీభావంగా "పొన్నాడ బ్రిడ్జి దగ్గర జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద సమావేశం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేయడం జరుగుతుందని ఏవీ సురేష్ వెల్లడించారు. పాతపట్నం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రెడ్డి శాంతి ఆదేశాల మేరకు పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలు, నుండి జెడ్‌పిటిసిలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా మరియు నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మరియు విద్యార్థులు, నిరుద్యోగులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయవలసినదిగా జిల్లా వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి అందవరం వెంకట్ సురేష్ పిలుపు నిచ్చారు.

పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - టెక్కలి : బిజెపి పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్లో టెక్కలి మండల అధ్యక్షులు జర్జన రాంజీ ఆధ్వర్యంలో నియోజకవర్గ బిజెపి విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తేజేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, బిజెపి పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు గ్రామాలలో బలపరిచే విధంగా దిశ నిర్దేశం చేయాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడీ తిరుపతిరావు, రాష్ట్ర డిపార్ట్మెంట్స్ అండ్ సెల్స్ కో ప్రబారి పైడి వేణుగోపాల్ రావు, శ్రీకాకుళం జిల్లా ఇంచార్జ్ విజయానంద రెడ్డి, సెవ్వన ఉమా మహేశ్వరి, పూర్వ అధ్యక్షులు బిర్లంగి మహేశ్వర, చక్కని నియోజకవర్గ కో కన్వీనర్ లక్ష్మీనారాయణ, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి,మహిళా నాయకురాలు సిరిపురం నాగరత్నం,ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు రాజ్ కుమార్ రెడ్డి, మరియు టెక్కలి, నందిగాం, కోటబొమ్మాలి, సంతబొమ్మాలి మండల అధ్యక్షులు, నాయకులు, మోర్చా జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాల సముదాయ సమావేశాలను వాయిదా వేయాలి

విశాలాంధ్ర - పొందూరు : మార్చి 12వ తేదీ బుధవారం నాడు జరగనున్న పాఠశాల సముదాయ సమావేశాలను వాయిదా వేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరి ప్రసన్న, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేస్తూ తెలిపారు. ఒకవైపు పదో తరగతి గ్రాండ్ టెస్టులు జరుగుతున్నాయి. మరో వైపు చాలా పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు, పదవ తరగతి వీడ్కోలు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్థాంతరంగా ఇప్పటికిప్పుడు ఎటువంటి విధి విధానాలు లేకుండా పాఠశాల సముదాయ సమావేశాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంలో అర్థం లేదు. కాబట్టి పదో తరగతి పరీక్షలు పూర్తయిన తర్వాత మాత్రమే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది

- విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- నేటి యువత పోరును విజయవంతం చేయాలి
- వైకాపా రాష్ట్ర కార్యదర్శి కేవిజి.సత్యనారాయణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చలగాటం ఆడుతుందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నయ వంచన పాలన చేస్తుందని దీన్ని ప్రతి ఒక్కరూ నిలదీ యాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి కేవిజి సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం తన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత వైసి పి పాలనలో రాష్ట్రం విధ్వంసం చెందిందని ప్రస్తుత ముఖ్య మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే ఇచ్చిన హామీల అమలు పరచడం లేదని ప్రజ ల ముందు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని, ఎన్నికల ముందు ఈ రాష్ట్ర పరిస్థితి 40 ఏళ్ల ఇండస్ట్రీకి అర్థం కాలేదా అని ప్రశ్నించారు. ఈనెల 12న యువత పోరు కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్మెంట్ కు రూ. 3600 కోట్లు బకాయిలు ఉం టే ఇటీవల జరిగిన బడ్జెట్లో రూ. 2,600 కోట్లు మాత్ర మే కేటాయించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఈ పథకంతో పేద కుటుం బాలకు చెందిన వారు ఎంతోమంది డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారని గుర్తు చేశారు. అప్పట్లో 2014-19లో కూడా ఈ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం తూట్లు పొడి చిందని అన్నారు. మరల వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే సక్రమంగా అమలయింది అన్నారు. ఇప్పుడు మరలా కూటమి పాలనలో పాత రోజులే పునరావృతం అవుతున్నాయి తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేయాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని కోరు తూ వైఎస్సార్సీపీ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం లేనిపోని సాధ్యము కానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని మండిపడ్డారు. రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు దుంపల లక్ష్మణరావు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందు లకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై యువత పోరు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం లేనిపోని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఏ ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదని అన్నారు. గత వైకాపా హయాములో ఏడాదిలో పథకాలన్నీ పక్కా గా అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కే సాధ్యమన్నారు. యువతకు నిరుద్యోగ భృతి కూడా కల్పించడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నా రని అన్నారు. దీనికి నిదర్శనం ఇటీవల జరిగిన ఉత్త రాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘోర పరాజయం పాలయింది అన్నారు.

వైసిపి మండల పార్టీ నాయకుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పేదలకు నేరుగా వారి ఖాతా లోకి సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. ప్రతి పథకాన్ని ఓ తేదీ ప్రకటించి ఆ తేదీకే వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సాధ్యమన్నారు. రైతులకు రైతు భరోసా పథకం నేటికీ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నేటికీ తొమ్మిది నెలలు కావస్తున్న సూపర్ సిక్స్ పథకాల్లో రెండు పథకాలే ప్రవేశపెట్టారని అవి కూడా లబ్దిదారులకు పూర్తిగా అందడం లేదని అన్నారు. అనంతరం ఫీజు పోరు బాట పోస్టర్లును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పప్పల రమేష్ కుమార్, మాజీ సర్పంచ్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, బెవర మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు గ్రామాల్లో విస్తరించాలి : లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రసాద్

విశాలాంధ్ర - నరసన్నపేట : రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ సేవలు గ్రామాల్లో మరింతగా విస్తరించాలని లయన్స్ క్లబ్ గవర్నర్, ఎన్.బి.ఎస్.ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళ వారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షులు, రమణ సాహు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే వేసవిలో పేద ప్రజానీకానికి అవసరమైన సేవా కార్యక్రమాలను చేయాలన్నారు. అనంతరం ఆయన స్థానిక బి.సి వసతిగృహంలో 10వ తరగతి చదువుతున్న విధ్యార్ధినులతో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుండి నిర్వహించే పది పరీక్షలు చక్కగా వ్రాసి, మీరు కోరుకున్న లక్ష్యాలు సాధించాలని కోరారు. ఈ సంధర్భంగా విధ్యార్ధినులకు ఫ్లాంక్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, రంగనాథ్, సాయిరాం, బాలగంగాధర్, సదాశివుని కృష్ణ, సాయిశ్రీనివాస్‌శర్మ, పొట్నూరు రమేష్, తూముల శ్రీనివాసరావు, బోయిన బాలకృష్ణ, కాశిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడి తోట వేలం పాట వాయిదా

విశాలాంధ్ర - పోలాకి : కోడూరు జీడి మామిడి తోట ఈనెల 18వ తేదీకి వేలంపాట వాయిదా వేసినట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఈ మేరకు పోలాకి మండల పరిషత్ లో ఈనెల 11వ తేదీ మంగళవారం వేలంపాట జరిగినప్పటికీ ప్రభుత్వం ధర 1,96,600 రూపాయలు నిర్ణయించడంతో లబ్ధిదారులు పాట పాడేందుకు మగ్గు చూపుకుపోవడంతో ఈనెల 18.వ తేదీ ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఈవో పి ఆర్ డి పద్మావతి ఏవో సూర్య ప్రకాష్ గొర్లె ఎర్రయ్య కరుకోల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్వామివారి గరుడ వాహన సేవ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీ చక్రధర పెరుమాళ్ళ స్వామివారి డోలోత్సవాలు, తృతీయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారికి తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నుండి యాగశాల అర్చన ప్రధాన విశేష హోమాలు మంగళ శాసనములు యాగశాల అర్చన విశేష హోమాలు వేద విన్నపములు అనంతరం గరుడ వాహనంపై స్వామివారికి గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు వి.కృష్ణారావు, వి.రాంబాబు,వి. విజయ్ కృష్ణ తో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మినీ సబ్ స్టేషన్‌లో చోరీకి గురైన కాపర్ వైర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస మండలం, అక్కులపేట ఎత్తిపోతల పథకం (బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ 20 పిల్ల కాలువ) వద్ద గల ఎల క్ట్రికల్ మినీ సబ్ స్టేషన్ లో ఉన్నటువంటి మూడు ట్రాన్స్ఫార్మర్లలో గల సుమారు 15 లక్షల రూపాయల విలువైన కోయిల్స్ మరియు ఎలక్ట్రికల్ ఆయిల్ చోరీ కాబడినది అని గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి తెలి పారు. గత కొన్ని రోజులుగా ఎత్తిపోతల పథకం లైను షట్ డౌన్ చేసినట్లు వివరించారు. ఇటీవల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించినప్పుడు అనుమానం కలిగి ఎల క్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారులకు విషయం తెలియచే యడంతో వారు పరిశీలించి అందులో కాపర్ వైర్ లేన ట్లు గుర్తించారు. ఈ విషయమై ఆమదాలవలస పోలీ స్ స్టేషన్‌లో సదరు ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సర్పంచ్ గౌరీపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై బురద చల్లి చెడ్డ పేరు తీసు కురావడానికి ఎవరో కుట్ర చేసి కాపర్ వైర్ దొంగిలించి ఉంటారని ఆరోపించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు నిర్వహించాల్సి ఉంది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధి కారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆముదాలవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజ్ రియంబర్స్‌మెంట్ చెల్లించేంత వరకు పోరాటం

విశాలాంధ్ర-పోలాకి: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామని మాజీ డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. వెదుళ్లవలస తన స్వగ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన యువత పోరు కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులుతో పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా విద్యార్థిని విద్యార్థులకు చదువులు పై చిన్నచూపు చూస్తున్నదని ఫీజు రియంబర్సమెంట్ సౌకర్యాలు కల్పించకుండా మార్గమధ్యంలో విద్యార్థులను విడిచిపెట్టిందని, విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్ మెంట్ చెల్లించేవరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు కనితి కృష్ణారావు ఎంపీటీసీ ప్రతినిధి తూలుగు అశోక్ ఆర్ త్రినాథ్ రావు లక్ష్మణరావు చింతు రామకృష్ణ బచ్చు ఆదినారాయణ బంక చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయగణపతి వార్షికోత్సవం



విశాలాంధ్ర-టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీశ్రీశ్రీ విజయగణపతి స్వామివారి 5వ వార్షికోత్సవ వేడుకను కళాశాల యాజమాన్యం భక్తి, శ్రద్ధలతో మంగళవారం నిర్వహించింది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు పలు ఆర్జిత సేవలు, విశేష హోమం బంకుపల్లి సురేష్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్య దర్శి ఎల్.ఎల్. నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వర రావు, ఐతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్లు డాక్టర్ కొంచాడ రవికుమార్, డాక్టర్ మధుకుమార్, టంకాల నాగశేషు కుటుంబ సమేతంగా స్వామివారి కైంకర్య సేవలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ .శ్రీనివాసరావు, డీన్లు, హెచ్ ఒడిలు, మెంటినెన్స్ విభాగ ఇన్చార్జ్ పిరియా రమేష్కుమార్ పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు స్వీకరించారు.

కేశవరెడ్డి విద్యాసంస్థల మోసంపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం జిల్లాలలో కేశవరెడ్డి విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు మోసగించారని శాసనసభలో శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ ప్రస్తావించారు. 2010లో ఈ విద్యా సంస్థ ద్వారా విద్యార్థులు జాయిన్ అయ్యారని సుమారు 800 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశారని అప్పట్లో ప్రతి విద్యార్థి నుంచి రెండు లక్షల నుండి 8 లక్షల వరకు ఫీజుల రూపంలో వసూలు చేశారని మొత్తం 42 కోట్ల మీద కలెక్షన్ చేసి చేతులు ఎత్తేసారని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ప్రోమ్సరీ నోట్లో చెక్కులు, ఇవ్వడం జరిగిందని, దీనిపై కేశవరెడ్డి కుమారుడు భరత రెడ్డి న్యాయం చేస్తానని చెప్పారు కానీ ఎంతవరకు ఎటువంటి న్యాయం జరగలేదని చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఈ విద్యా సంస్థపై 15 కేసులు నమోదయాయని అయినప్పటికీ యాజమాన్యం విద్యార్థుల పట్ల పూర్తి అన్యాయం చేసిందని విద్యార్థులకు తల్లిదండ్రులకు న్యాయం చేయాలని విద్యా శాఖ మంత్రి దీన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం అర్బన్ శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల లో .విద్యాసంస్థలు ఉన్నాయని ఇప్పటికైనా విద్యా శాఖ మంత్రి దృష్టపెట్టి విద్యార్థులకు , తల్లిదండ్రులకు న్యాయం చేయాలని దీనిపై విద్యాశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

మాజీ డీలర్ మృతి



విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం బైపల్లి గ్రామానికి చెందిన పౌర సరఫరాల సరుకుల మాజీ డీలర్ పట్నాన ఆనందరావు (60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత 50 ఏళ్లుగా బైపల్లి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందజేసి అందరి మన్ననలను పొందిన పట్నాన ఆనందరావు మృతి గ్రామస్తులను కలచివేసింది. గ్రామంలో ఎవరికి అపద వచ్చిన ముందుండేవారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. ఆనందరావుకు భార్య ఇందిర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నెలవారీ పదోన్నతులు చేపట్టాలి

- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి

విశాలాంధ్ర-ఆమదాలవలస: రాష్ట్రంలో 2023 వ సంవత్సరం ఏప్రిల్ నాటికి 22, 723 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిందని వాటిలోనే 16,347 పోస్టులను డీఎస్సీ కు కేటాయించిందని అయిన ప్పటికీ అప్పటికీ 6000 పై చిలుకు పోస్టులు ఖాళీగా ఉండేవని నేటికీ మొత్తంగా కలుపుకుంటూ పోతే 27409 టీచర్ పోస్టులు ఈ రాష్ట్రంలో ఖాళీలు ఉన్నాయని ఇన్ని వేల పోస్టులు రెండు సంవత్సరాలు గా ఖాళీలుగా ఉన్న కనీసం పదోన్నతులు చేపట్టకుండా నేరుగా డీఎస్సీ ద్వారా నింపకుండా కేవలం మొక్కుబ డి డీఎస్సీ ప్రకటనతో కూటమినేతలు కాలయాపన చేస్తున్నారని ఇది పాలక వర్గానికి ఎంత మాత్రం తగ దని ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఎస్ వి రమణ ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. మంగళవారం ఆమదాలవలస మండల విద్యాశాఖా కార్యాలయంలో అందుబాటులో ఉన్న కార్యవర్గ సభ్యులతో ఒక సమావేశం ఏర్పాటు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లా డుతూ ఉన్న ఖాళీల మేరకు నెలవారీ పదోన్నతులు చేపట్టి సకాలంలో సబ్జెక్టు ఉపాధ్యాయులు నింపే విధా నం గతంలో ఉండేదని ఈ విధానంతో సబ్జెక్టు ఉపాధ్యాయులు కొరత తీర్చేవారని ఈ విధంగా పదవీ విరమణ ఖాళీలను ఎప్పటికప్పుడు నింపే వారని కానీ ఈ విధా నాన్ని గత కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు అట కెక్కించారని కొన్ని ఉన్నత పాఠశాలల్లో నూ ముఖ్యం గా పురపాలక పాఠశాలలు అయితే అన్ని పాఠశాలలో కూడా అర్హత కలిగిన ఎస్టీటీ ఉపాధ్యాయుల తోనే ఉన్నత పాఠశాలలో బోధన చేయిస్తూ నెట్టు కొస్తున్నా రని ఇప్పటికైనా పాలకవర్గం స్పందించి నెలవారీ పదో న్నతులు చేపట్టి ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు కొరత తీర్చాలని తద్వారా విద్యార్థుల అభ్యసన ప్రగతి కుంటు పడకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే రానున్న బదిలీ చట్టంలో కూడా నెల వారీ పదోన్నతలకు అవకాశం ఉండాలని ఆయన అధికారులను కోరారు.సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, హెచ్ సత్యం, ఎస్.శ్రీనివా సరావు, ఎం. రమేష్ కుమార్ ఆమదాలవలస నియో జకవర్గ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

బిజెపి గూటికి చేరిన ఆర్ఎస్ఎస్ నేత "రాంబిల్లి"

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మండల కేంద్రానికి ఒకనాటి బిజెపి కంచుకోటగా ఉండే చేనేత, ఖాదీ నగరానికి మరోసారి పాత కళ నెరవేరబోతున్నట్లే కనిపిస్తుంది. అలనాటి పార్లమెంటరిలో రెండు స్థానాలే గెలుపొందిన బిజెపి రోజుల్లో పొందూరు మండలం బిజెపికి కంచుకోటగా నిలిచింది. ఒకవైపు ప్రజా ఉద్యమాలు ఉరకలుతిస్తూ, కమలపు జెండాలు రెపరెపలాడేవి అప్పటి పార్టీ అభివృద్ధికి కీలక సూత్రధారుల్లో ఒకరైన రాంబిల్లి నాగరాజు రాజకీయాలకు అతీతంగా కొన్నాళ్లు దూరమయ్యారు. పార్టీ కేడర్ అంతరించిపోవడంతో పాత బీజేపీ కేడర్ ను కలుపుకొని పోయే వ్యక్తిగా పేరు ఉన్న పాతతరం ఆర్ఎస్ఎస్ నేత రాంబిల్లి నాగరాజును బిజెపి పార్టీలోతిరిగి రంగ ప్రవేశం చేసేందుకు తీవ్ర కృషి ఫలించింది. విద్యావంతుడు, చురుకైన వ్యక్తిగా అందరికీ చూపరిచితుడుగావుండే రాంబిల్లిని తన తల్లి పార్టీ అయినటువంటి బిజెపిలో చేరడంతో పట్టణములో కొత్త పుంతలు తొక్కే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే పాత కేడర్ నాగరాజు రాకతో అభినందనలు తెలియజేస్తున్నారు. పార్టీ అభివృద్ధే ధ్యేయంగా వ్యూహరచన చేపడుతున్నట్లు నాగరాజు వెల్లడించారు. పట్టణ వర్తక వ్యాపారులు, గతకాల బిఎంఎస్, బీజేపీ కిషన్ మోర్చా, యువ మోర్చా, దళితమోర్చా, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, విశ్వహిందూ పరిషత్, బిజెపి సంస్కృతిక విభాగ్ వంటి ప్రజా సంఘ ప్రతినిధులు సమైక్య సమావేశం నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రభుత్వ రంగ బ్యాంకుల పటిష్టతకు కృషి చేసి, బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని యునైటెడ్ ఫారం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ బి శ్రీనివాసులు కోరారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక శ్రీకాకుళం సింహద్వారం వద్ద గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, అధికారులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫారం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ బి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులపై ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. బ్యాంకు అధికారులపై ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం ఖండించకుండా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. బ్యాంకులలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తగినన్ని కేడర్లలో వెంటనే రిక్రూట్మెంట్ జరపాలని అన్నారు. అంతేకాకుండా ఐదు రోజుల పని దశాలను వెంటనే అమలు చేయాలని అన్నారు . ఐ బోక్ రీజనల్ కార్యదర్శి కే తేజేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు వారు వచ్చే జీతంపై టాక్స్ భరిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే కానీ ఇప్పుడు మరల ఉద్యోగులకు వచ్చే రుణ సదుపాయాలపై కూడా టాక్స్ వసూలు చేయాలనే దృష్టిలో బ్యాంకింగ్ యాజమాన్యాలు ఆలోచిస్తున్నాయని వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఆ యొక్క టాక్స్ లను సంబంధిత బ్యాంకులే భరించాలన్నారు. కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు గిరిధర్ నాయక్ మాట్లాడుతూ బ్యాంకులలో టెంపరరీ గా పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, బ్యాంకు యాజమాన్యాలు తాత్కాలిక నియామకాలు చేయకూడదని శాశ్వత నియామకాలు మాత్రమే చేపట్టాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల ఉపాధ్యక్షురాలు జి.కరుణ , ఇండియన్ బ్యాంక్ మహిళా కన్వీనర్ శ్రావణి ,కోఆర్డినేషన్ జాయింట్ కార్యదర్శి ఏ. సూర్య , ఓబీసీ ఉద్యోగ సంఘ నాయకులు సూర్యకిరణ్, నరేష్, శ్రీనివాస్,ఉపేంద్ర మరియు అధిక సంఖ్యలో అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

మందసలో ఒడియా భాషాదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-మందస: ఒడియా సంస్కృతి,భాష, విద్య నిర్వీర్యం కాకుండా ఐకమత్యంతో కృషి చేయాలని ఒడిషా రాష్ట్రా సాహిత్య అకాడమీ ప్రతినిథి పూర్ణ చంద్ర మహా పాత్రో కోరారు. 1936 సంవత్సరం ఏప్రిల్ 1న ఆంధ్ర-ఒడిషా రాష్ట్రా ల విభజన లో భాగంగా గంజాం జిల్లా నుంచి విడిపోయిన తరువాత శ్రీకాకుళం జిల్లాలో వేలాది మంది ఒడియా మైనారిటీ ప్రజలు నివసిస్తున్నారని ఆయన అన్నారు. ఒడిషా రాష్ట్రీయ భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఒరియా యంగ్ మైన్స్ లైబ్రరీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో నివసిస్తున్న ఒడియా మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం ఒడిషా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ కృషి చేస్తుందని అన్నారు. ఉత్తరాంధ్ర ఒడియా మైనారిటీ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ పాడి,దుర్గా ప్రసాద్ పాణిగ్రహీలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఒడియా విద్య అభివృద్ధి చెందకుండా అడ్డంకులు ఉన్నాయని ఒడియా పాఠశాలలను తెలుగు ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ,కొత్తగా ఒడియా పాఠశాలలు ,ఒడియా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒడియా విద్య నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో ఒడిషా జగన్నాథస్వామి ప్రచారకులు శరణ వింధ్ వజా, డాక్టరు విద్యుత్ ప్రభాసాహు,భాస్కర్ పాడి,బృందావన దొలై, పవిత్రో మహారథ, సుజీన్ కుమార్ పండా,రవీంద్ర కుమార్ పాడి, ప్రోదేష్ కుమార్ త్రిపాఠి, సింహాచలం పతి,సంతోష్ కుమార్ పానిగ్రహీ, జగదీష్ పండా,శ్రీనివాస పాడి, తదితరులు కార్యక్రమంలో భాగంగా ఒడియా కవులు రచించిన కవితలు చదివి వినిపించారు.సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

చెరువులు పోరంబోకు భూముల ఆక్రమణలు అరికట్టాలి

- సీపీఐ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ సాలిన

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని గొర్లెపాడు పంచాయతీలో వున్న పోరంబోకు భూములు, చెరువులు ఆక్రమణలు గురైనట్లు సిపిఐ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్చార్జి సాలిన నారాయణస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యదర్శి పుక్కల్ల అరేలమ్మ అన్నారు. మండలంలోని గొర్లెపాడు గ్రామ సర్పంచ్ వసంత వల్లభరావు ఆరోపణల మేరకు గొర్లపాడు పంచాయతీలో ఆక్రమణలకు గురైన భూములను వారు పరిశీలించారు. గొర్లపాడు సర్పంచ్ వల్లభరావు తమ వద్ద మొర పెట్టుకోవడంతో పోరాంబోగు భూములు, చెరువులు కబ్జా జరిగిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని వారు తెలిపారు. ఈ పరిశీలనలో సర్వే నెంబర్ 105, గొర్రెగుండం చెఱువు,విస్తీర్ణం 6.34 సెంట్లు, సర్వే నంబర్ 167,సున్నకోల చెఱువు, 3.43 సెంట్లు విస్తీర్ణం, తావుడు బంగాళా చెఱువు (పారి చెరువు) 1.25 సెంట్లు విస్తీర్ణం, పోరంబోకు భూములు సర్వే నంబర్ 197 ,విస్తీర్ణం 2.06 సెంట్లు, ఇంకా 8 ఎకరాలు భూమికి అడంగల్ రావడం లేదని , విశ్రాంత సైనిక ఉద్యోగి కి పోరంబోకు భూములు అందజేస్తే అతని మరణ అనంతరం ఆ భూము లను కూడా ఆక్రమించారని ఆరోపించారు. 136/5 లో ఉన్న మంగళవారం సంత భూమి కూడా ఆక్రమించారని ఆరోపించారు. ఆక్రమించిన వారిలో విశ్రాంత ఉద్యోగి, సీనియర్ అధికార పార్టీ నేతలు మండలస్థాయి అధికారులను భయపెట్టి వారి పేరున రాసుకున్నారని పేర్కొన్నారు.కరగాన వసంత వల్లభరావు సర్పంచ్గా ఎన్నికైన అనంతరం పలుమార్లు తాసిల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ ను కలసి పలుమార్లు విన్నవించడం జరిగిందని తెలిపారు.గత ప్రభుత్వం హయాంలో ఉన్న నియోజకవర్గ నాయకులతో పాటు జిల్లా నాయకులకు విషయాన్ని తెలియజేయడం జరిగిందని సహకరించకపోగా ఆక్రమణలు చేసుకున్న వారిని అండగా నిలిచారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో గురునాథ్, దాలయ్య,రాజారావు, దాసు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: ఉద్దాన ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఈనెల 18, 19 తేదీలలో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించునున్న ప్రజా చైతన్య యాత్రలు విజయవంతం చేయాలని కోరారు. దీనిలో భాగంగా మంగళవారం వామపక్ష పార్టీలతో కలిసి మందస, వజ్రపుకొత్తూరు మండలాలలో గల కార్గో ఎయిర్ పోర్ట్ పరిసర గ్రామాలలో ప్రచార యాత్రను వొంకులూరు సంఘ భవనంలో పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసుదేవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చాపర వేణుగోపాల్, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావులు మాట్లాడుతూ ఈ నెల 18,19 తేదీలలో జరుగు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార యాత్రకు మాజీ ఎమ్మెల్సీ ఎమ్ వి శర్మ,సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్,(ఎన్ డి) సిపిఐఎం.ల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శులు, సిహెచ్ వెంకటరమణ,డి గోవిందు, తాండ్ర ప్రకాష్, టి సన్యాసిరావు పాల్గొంటారని తెలిపారు 18వ తేదీ ఉదయం 8 గంటలకు రాంపురంలో ప్రచార యాత్ర మొదలవుతుందని,పచ్చని ఉద్దాన తీర ప్రాంతాలలో విధ్వంసకర కార్గో ఎయిర్పోర్ట్ వద్దని, వ్యవసాయ ఆధార పరిశ్రమలు నెలకొల్పి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రజలకు కోరుకుంటుంటే పచ్చని భూములు నాశనం చేయడం పాలకులకు సరికాదని అన్నారు. పోరాట కమిటీ కార్యదర్శి అప్పారావు గారు మాట్లాడుతూ 18 వ తేదీన మందస, 19వ తేదీన వజ్రపు కొత్తూరు మండలాల్లో ప్రసారం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ రామస్వామి, చీకటి ధనుంజయ్ రావు, సిహెచ్ వల్లభరావు, రామ్మూర్తి, ఢిల్లీ రావు, గుంటూరు రామారావు, జోగి శ్రీదేవి, విజయ, సంతోష్,రామారావు,హేమరాజు,దున్న హరికృష్ణ,గుంటు రామస్వామి, మైలపల్లి శేఖరం, తదితరులు పాల్గొన్నారు

ప్రధాన రహదారి మార్గం కల్పించండి

విశాలాంధ్ర-టెక్కలి: డివిజనల్ కేంద్రంలో దశాబ్ద కాలంగా ఉన్న ప్రధాన తపాలా కార్యాలయం కి ప్రధాన ప్రవేశ మార్గం లేక స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇరుకుగా ఉన్న సందులో నుంచి వెళ్లాల్సి వస్తుందని, ఆ ప్రక్కనే ఉన్న మురికి కాలువ నుండి దుర్వాసన రావడంతో ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఖాతాదారులు అంటున్నారు. తపాలా కార్యాలయానికి ప్రవేశ మార్గాన్ని ప్రధాన రహదారి నుంచి కల్పించాలని తపాలా కార్యాలయ అధికారి ఎండన్న కి స్థానికులు బోకర బాలకృష్ణ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించి, ఉన్నత అధికారులు దృష్టికి తీసుకు వెళ్లే దిశగా ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.

ఫీజు పోరు విజయవంతం చేయండి



విశాలాంధ్ర - సంతబొమ్మాళి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం లో జరుగు ఫీజుపోరు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టెక్కలి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు లినక్కిట్ల నరేష్‌లి గారు కోరారు. 12వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు టెక్కలి పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీగా బయలుదేరి శ్రీకాకుళం కలెక్టరేట్ దగ్గరకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తో పాటు కార్యకర్తలు, నాయకులు యువకులు విద్యార్థి విభాగం సభ్యులు అందరూ హాజరు కావాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో టెక్కలి,నందిగాం, సంతబొమ్మాళి,కోటబొమ్మాళి మండలాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు,ఎంపీపీలు, సర్పంచ్లు ఎంపీటీసీలు జడ్పీటీసీలు,ముఖ్య కార్యకర్తలు అందరు ఈ కార్యక్రమం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

వి ఫర్ నీడీ సంస్థ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: రైలు నుంచి జారిపడి కాలు తొలగించబడిన సంతబొమ్మాళి గ్రామానికి చెందిన దూబ జగ్గమ్మ కుమారుడు అప్పన్న కు 10 వేల రూపాయిలు, పంగజగ్గపేట గ్రామానికి చెందిన నిరుపేద అనాధ నీలాపు చిన్నమ్మి ఇంటి నిర్మాణానికి మరో 10 వేల రూపాయలు, గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోటబొమ్మాళి మంగళ వీధికి చెందిన చిగురువలస వీరస్వామి కి 5000రు అమెరికాకు చెందిన వి ఫర్ నీడి సంస్థ, మనబడి వెల్ఫేర్ అసోసియేషన్, వల్లేవలస సభ్యుల ద్వారా అందించారు. వి ఫర్ నీడి చేసిన సహాయానికి ఆ రె కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సహాయ కార్యక్రమంలో మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి,ఇప్పిలి అప్పన్న, బాడాన చిన్నమనాయుడు, కుచెట్టి భాను ప్రకాష్, నౌగపు నాగరాజు లు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ హనుమాన్ ఉత్సవాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి గ్రామంలో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన హనుమాన్ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. గత మూడు రోజులుపాటు జరిగిన ఈ ఉత్సవాలు తిరువీధి తో ఆరంభమై స్వామివారికి పంచామృత అభిషేకాలు సింధూరభిషేకాలు తమలా అర్చనలు నిమ్మార్చనలు ఘనంగానిర్వహించారు.అనంతరం గ్రామ పురోహితులు సుసరాపు గున్నబాబు ఆధ్వర్యంలో వేదపండితులు చండీ హోమం ,మృత్యుంజయ, హనుమాన్ హోమాలు ను నిర్వహించి పూర్ణాతి సమర్పించి, మహా హారతులు చేపట్టారు. ఈ సందర్భంగా కోలాటం, శ్రీ మహంకాళి నృత్య ప్రదర్శన లు బాగా ఆకట్టు కున్నాయి, చివరి రోజు మంగళవారం మహా అన్నసమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమం లో భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామి ని దర్శించుకుని అన్న సమారాధన లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జైంట్ వీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, యువతీ యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సహకారం అందించారు.

బోర్‌కు మరమ్మతులు

విశాలాంధ్ర-పలాస: మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురం గ్రామంలో మంచినీటి బోరు పాడవడంతో ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామ ప్రజలకు ఈ ఒక్క బోర్ ఆధారం కావడంతో చాలా కుటుంబాలు తాగునీటికి ఇబ్బంది పడటం చూసి గ్రామ కూటమి నాయకులు, సర్పంచ్ లు గ్రామ కార్యదర్శి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు.సకాలంలో అధికారులు స్పందించడంతో బోర్ వెల్ సాంకేతిక నిపుణుడు జగదీష్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించడంతో ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చేయడంతో సహకరించిన పంచాయతీ సర్పంచ్ మరియు అధికారులకు గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి సాయి, సంతోష్ రావునాయుడు, కృష్ణంరాజు, విజయ్, బాబురావు ,తులసి రావు, ఆనంద్ రావు ,ఢిల్లీ, ముకుందరావు ,నాగరాజు మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన శాస్త్రీయ సంగీత విభావరి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామివారి డోలోత్సవము మరియు తృతీయ బ్రహ్మోత్సవములలో బాగంగా ఆలయ ధర్మకర్త పొందల క్రిష్ణారావు,కుమారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా శాస్త్రీయ సంగీత విభావరి కార్యక్రమం సంగీత ప్రియులకు ఉర్రూతలూగించింది. సాయంత్రం 7 గంటలకు బెజ్జిపుట్టుగ శ్రీ చక్రపెరుమాళ్ళ కళావేదికలో విజయవాడ కు చెందిన కుమారి లంక తేజస్వి (గాత్రం) ,విశాఖ పట్టణం కు చెందిన సరస్వతుల పార్థివ్(వయోలిన్),విజయవాడ కు చెందిన కాకరపర్తి జగన్మోహిని (మృదంగం),విశాఖ పట్టణం కు చెందిన టి.యస్. చైతన్య (మోర్సింగ్), చండి పుట్టుగ కు చెందిన గొనప లక్ష్మణమూర్తి (కంజిర) తో ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత విభావరి కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.